

అమెరి'కా'లేజ్

- లిపి మల్లాది



అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో.. అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..

- సంపాదకుడు

(కిందటి సంచికనుండి కొనసాగింపు)

ఉదయం లేచేసరికి నేహ ఫోన్ మాట్లాడుతోంది. నేను లేవడం గమనించి సారి చెప్పింది. ఏం ఫరవాలేదని, నా అంతట నాకే మెలుకువ వచ్చిందని, తను ఫోన్ మాట్లాడ్డం వల్లకాదని చెప్పాను. నేను పళ్ళు తోమేసరికి తను ఫోన్ పెట్టేసి నా పక్క సర్ది మంచం మీద కూర్చుంది. థ్యాంక్స్ చెప్పి నేను కూడా కూర్చుని తన సమ్మర్ హాలిడేస్ ఎలా జరిగాయని అడిగాను. చాలా బాగా జరిగిందని, వాళ్ళు ఫ్లోరిడాకి వెళ్ళి అక్కడ పేరా గ్లైడింగ్, స్కూబ్ డైవింగ్, వేక్ బోర్డింగ్ చేసిన వీడియోలు చూపించింది. వాటిని చూస్తేనే నాకు దడగా అనిపించింది. ఎలా చేసారో అని ఆశ్చర్యపోయాను. మయామీకి వెళ్ళినప్పుడు వాళ్ళు తాడు పాముని మెడలో వేసుకున్న ఫోటోలు చూడగానే రోత పుట్టింది. నన్ను గమనించి ఆ ఫొటోలు వేగంగా తీసేసింది. స్కూబా డైవింగ్‌కి ఎవరైనా సర్టిఫికెట్ తీసుకోవచ్చని, తను తీసుకుందామనుకుంటుందని చెప్పింది. నన్ను కూడా తనతోపాటు ప్రయత్నించమని సూచించింది. ఆలోచిస్తానని చెప్పాను. అక్కడ వారు తిన్న వివిధ రకాల

భోజనం గురించి చెప్పింది. మాంసాహారం తినే వారు ఆక్టోపస్, స్క్విడ్, పింక్ ష్రింప్‌ని రుచి చూసారని ఆ ఫోటోలు కూడా చూపించింది. ఇందాకటిలా కాక ఈసారి నా ముఖంలో చిరాకు చూపించలేదు. తిన్నవారు పింక్ ష్రింప్ తీపిగా ఉండడంతో ఆశ్చర్యపోయిదాన్ని 'డిజర్ట్ ఫిష్ ' అని పిలవడం మొదలుపెట్టారని చెప్పింది.

అంత తీపిగా ఉన్న చేపని తినలేక ఒకరు పడేసారు అన్నప్పుడు 'దాని చావు వృధా' అన్నాను దాంతో మాంసాహారం గురించి ఆపేసి శాఖాహారం గురించి చెప్పసాగింది. తనకి నచ్చిన గ్రీన్ కొలార్డ్ కేక్‌ని తెగ పొగిడి, గ్రీన్ కొలార్డ్స్‌ని కొని తను వండే ప్రయత్నం చెయ్యబోతుందని చెప్పింది. నేను సహాయం అందిస్తానని చెప్పాను. అక్కడి రాష్ట్ర చెట్టైన సబల్ పామ్ నుండి వచ్చే స్వామ్స్ కాబేజీ తనకి నచ్చలేదని, అది తిన్నాక తనకి అజీర్ణంగా అనిపించిందని, నేను ఎప్పుడైనా ఫ్లోరిడాకి వెళ్ళితే దాన్ని తినవద్దని హెచ్చరించింది. అలాగేవారు తిన్న మోమోస్ బర్గర్ అందరికీ నచ్చలేదని చెప్పింది. అర్ధంకాక అదేంటి అని అడిగితే పాచిన ఉడకపెట్టిన పప్పు, అన్నం, నట్స్‌తో కలిసి చేస్తారని చెప్పింది. ఆ వాసనతో ఎలా తిన్నావు అని అడిగితే వండేసరికి వాసన పోతుందని చెప్పింది. నేను అదికూడా తినకూడదని నిశ్చయించుకున్నాను. అలా కొద్దిసేపు తిండిగురించి మాట్లడాక యూనివర్సల్ స్టూడియోస్ ఫోటోస్ చూపించింది. చిన్నప్పుడు చూసిన జీన్స్ సినిమాలో వాళ్ళు రైల్‌లో వెళుతూ గొరిల్లాని చూసి భయపడేది గుర్తొచ్చి దానికి వెళ్ళారా అని అడిగాను. తనకి అర్ధంకాక పోవడంతో యూట్యూబ్‌లో ఆ పాటని వినిపించాను. అది కింగ్ కాంగ్ రైడ్ అయ్యి ఉంటుందని, ఇప్పుడు లేదని చెప్పింది. దాని బదులుగా ఇప్పుడు స్టార్ వార్స్‌కి సంబంధించింది ఉందని చూపించింది. అదేంటో నాకు తెలీదంటే జాలిగా చూసి 'డోంట్‌వర్రీ. ఐ విల్ షోయు అంది '.

మేజిక్ కింగ్‌డమ్ కి వెళ్ళడానికి సమయం లేకపోవడంతో కేవలం డిస్ని స్ప్రింగ్స్‌కి వెళ్ళారని చెప్పింది. మళ్ళీ తెలియదంటే జాలిపడుతుందని తలుపాను. అక్కడ సన్‌సెట్‌కి వాళ్ళు తీసుకున్న ఫోటోలు కొన్ని చూపించింది. అలాగే తను మాత్రమే ఉదయం లేచి రోజూ బీచ్‌లో సన్‌రైజ్ చూసేదని ఎప్పింది. 'ఫొటో ఉందా' అని అడిగాను.

'లేదు, నేను తీసేవాటికన్నా వందరెట్లు మంచి ఫోటోలు ఇంటర్నెట్‌లో దొరుకుతాయి. అలా బీచ్‌లో రోజూ సన్‌రైజ్ చూసే అవకాశం ఎక్కువసార్లు రాదు కాబట్టి నేను కేవలం అక్కడ కూర్చుని ఆశ్వాదించేదాన్ని. సొన్, సర్ఫ్ ఏదీ లేకుండా వెళ్ళి సన్‌రైజ్ అయ్యాక కొద్దిసేపు స్విమ్మింగ్ చేసి వేడి పెరిగాక తిరిగి వెళ్ళిపోయేదాన్ని' అంది. రెండు క్షణాల్లాగి 'ఈ సన్ సెట్ ఫోటోస్ కూడా నేను తీసినవి కావు. మిగతావారు పంపారు' అంది.

'కనీసం ఒక్కటైనా తీసిందికదా నీ గుర్తుకి?' అడిగాను.

"నాకు డెబ్బై ఏళ్ళు వచ్చి ఆల్‌జైమర్స్ వస్తే నేను ఆ ఫోటోలు చూసినా నాకు ఏమీ గుర్తుకురాదు. కానీ నేను ఆ పది నిమిషాలు ప్రకృతిని ఆశ్వాదించింది నా అనుభూతుల్లో మిగిలిపోతుంది, బహుశా జ్ఞాపకం రావచ్చుకూడా' అంది.

నేను ఏదైనా అనేలోపే "ఎనఫ్ ఆఫ్ మై ఫిలాసఫీ లుక్..." అంటూ మరిన్ని ఫోటోలు, అక్కడ జరిగిన సంఘటనలు చెప్పసాగింది. చివరికి నాకు ఆర్లాండొ మరియు మయామీ నుండి తెచ్చిన మాగ్నెట్లు ఇచ్చింది. 'దేనికి?' అన్నట్లు చూసాను.

"సూవినియర్" కన్ను కొట్టి తన గదిలోకి వెళ్ళిపోయింది. నేను అన్నయ్యని కలవటానికి వెళ్ళినప్పుడు కాని, రోడ్ ట్రిప్‌కి వెళ్ళినప్పుడు కానీ తనకి ఏమీ తీసుకురాలేదని సిగ్గుపడ్డాను. వాటి ఫోటో అన్నయ్యకి పంపి రూమ్మేట్ తిరిగి వచ్చేసిందని చెప్పాను. అన్నయ్య దానికి 'హేవ్ ఫన్' అని బదులిచ్చేవాడు.

తయారయ్యి లాబ్‌కి బయలుదేరాను. కేంపస్ నిండా జనాలు. చాలామంది ఒకేసారి ఊడిపడినట్లుగా ఉంది. ఇదివరకటిలానే అంతా కోలాహంగా ఉన్నా, రెండు మూడు నెలలు ఎక్కువ జనాలు లేకపోవడంతో కాస్త ఆశ్చర్యంగానే అనిపించింది. లాబ్‌లో కూడా అందరూ తిరిగి వచ్చేసారు. కొందరు ఈ రోజు విశ్రాంతని ఇంట్లోనే ఉంటే మరి కొందరు సెమిస్టర్ మొదలవుతోందని ముందుగానే వచ్చేసారు.

ఉదయం రాగానే అందరూ ఎవరి సమ్మర్ గురించి వారు చెప్పసాగారు. "ఐ మిస్ హోమ్ ఫుడ్" అని ఒకరు "ఐ మిస్ మౌంటెయిన్ వ్యూ" అని ఒకరు, "ఐ యామ్ జెట్‌లాగ్" అని మరొకరు, రెయిన్, నేను వాళ్ళ కబుర్లు వింటూండగా నా ఫోన్‌లో మెసేజ్ వచ్చింది. చూస్తే అది రెయిన్ పంపింది. 'నువ్వు రాకముందు ఇదంతా చెప్పాడు. ఇప్పుడు మళ్ళీ అదే చెబుతున్నాడు' అంది. చిన్నగా నవ్వాను. నేను పట్టించుకోకుండా ఫోన్ చూస్తున్నా అతని కథలు మాత్రం ఆగలేదు. కొద్దిసేపు విన్నాక బోర్ కొట్టడం ప్రారంభమైంది. నేహలాగా ఆకట్టుకునేలా కథలు చెప్పడం ఇతనికి రాదు. అనుభవం కలిగిన వారందరూ కవులు కాలేరు అన్నట్లుగానే అనుభవించిన వారందరూ సరిగ్గా కథలు చెప్పలేరని అర్థమైంది. అతని కథలు పూర్తయ్యాక మరొకరు ప్రశ్నలు అడిగారు. నేను, రెయిన్ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నాము. ఇంతలో ప్రొఫెసర్ వచ్చారు. దాదాపు అందరూ ఉండడం చూసి ఆయన కూడా ఆశ్చర్యపోయారు. 'సమ్మర్ ఎలా జరిగింది' అని ఆయన అడగడంలో అతను మళ్ళీ మొదటి నుండి చెప్పసాగాడు. నేను, రెయిన్ ఒకరి మొహాలు ఒకరం చూసుకుని చుట్టుపక్కల వారి మొహాలు చూసాం. అందరం ఒకేలా ఆలోచిస్తున్నామని అర్థమైంది. రెండు, మూడు నిమిషాలకి ప్రొఫెసర్ తనని ఆగమని, డిటైయిల్స్ మళ్ళీ తీరిగ్గా వింటానని చెప్పి మిగతావారి వంక చూసారు. "ఇట్ వజ్ గుడ్", "ఇట్ వజ్ షార్ట్", "మచ్ నీడెడ్" అంటూ బదులిచ్చారు. నావంక, రెయిన్ వంక చూసి "వాట్ ఎబౌట్ యువర్ సమ్మర్?" అడిగాడు.

రెయిన్ వెంటనే "ప్రొడక్టివ్" అంది.

నేను "యస్" అన్నాను.

"ఇట్స్ ద లాస్ట్ వీకెండ్ బిఫోర్ ఫాల్ సెమిస్టర్ బిగిన్స్ గో ఎండ్ రెస్టప్" అన్నారు. నన్ను, రెయిన్‌ని చూసి "ఆర్ హేవ్ ఫన్" అని చిన్నగా నవ్వారు.

వెంటనే వెళ్ళిపోతే బాగోదని రెండు నిమిషాలు కూర్చుందాం అనుకున్నాను కానీ అందరూ వెంటనే లేవడంతో నేను కూడా రెయిన్ వెంటే నడిచాను. తను సెమిస్టర్‌కి కావలసిన పుస్తకాలని లైబ్రరీనుండి తీసుకోడానికి వెళుతున్నామని చెప్పింది. ఇప్పటిదాకా ఎందుకు తీసుకోలేదో అర్థంకాక ఆశ్చర్యపోయాను. ఎక్కువమంది చేరిన క్లాసులకి టెక్స్ట్ బుక్స్ లైబ్రరీలో దొరకకపోవచ్చని, ఎంత త్వరగా అద్దెకు తీసుకుంటే అంత మంచిదని అందరికి తెలిసిన విషయమే. 'నేను కూడా లైబ్రరీకి వెళ్ళాలి. నీతో వస్తాను, కానీ ఒకసారి రూమ్ కి వెళ్ళి పుస్తకాలు తీసుకోవాలి ' అన్నాను. తను సరే అనడంతో ఇద్దరు కలిసి నా రూముకి వెళ్ళాము. నేహ ఇంకా అక్కడే ఉండడంతో ఇద్దరికీ పరిచయం చేసాను. ఇద్దరూ కలుపుగోలు వ్యక్తులు కావడంతో నా ప్రమేయం ఎక్కువ అవసరం లేకుండానే వారు కబుర్లు మొదలుపెట్టారు. ఈలోగ నేను రిటర్న్ ఇవ్వాల్సిన పుస్తకాలు తీసుకున్నాను. ఇద్దరు ఇన్‌స్టాగ్రాములో ఫ్రెండ్స్ అయ్యారు. నేను చదివిన పుస్తకాల గురించి అడిగారు. రెయిన్ పెద్దగా పుస్తకాలు చదవదని, వాళ్ళ దేశంలో బుక్ రీడింగ్ కల్చర్ తక్కువ అని చెప్పింది.

ముఖ్యంగా వివిధ భాషలు మాట్లాడే వారు ఉండడం, మరియు వారి రాష్ట్ర భాష వేరవ్వడంలో ఎక్కువమంది పుస్తకాలు చదవరని చెప్పింది. చిన్నప్పటినుండి స్కూల్‌లో ఇంగ్లీష్ నేర్చుకోకపోతే ఇండియాలో కూడా ఇంగ్లీష్ పుస్తకాలు చదివేవారు ఉండేవాళ్ళు కాదేమో అనుకున్నాను. కానీ మాతృ భాషలో పుస్తకాలు చదివే వాళ్ళం కాబోలు. పాత రోజుల్లో అలాగే ఉండేది కదూ! ఫ్రీడా కాలో కథని ఇద్దరికీ చెప్పాను. అలాగే జయలలిత ఇంటర్వ్యూ గురించి కూడా చెప్పాను. ఇద్దరూ చూడాలనుకున్నారు. దాంతో రెయిన్ లైబ్రరీకి మధ్యాహ్నంగా వెళదాము. ఇప్పుడు ఇంటర్వ్యూ చూద్దాం అంది. రెయిన్ కూడా ఒప్పుకోవడంతో వారు ఇంటర్వ్యూ చూస్తుండగా నేను అన్నం, వంకాయకూర, ఉత్తపప్పు చేసాను. రెయిన్ ఆ ఇంటర్వ్యూ చూసి కాస్త కంటనీరు పెట్టుకుంది. ముగ్గురం పాలిటిక్స్ గురించి, స్ట్రాంగ్ విమెన్ గురించి మాట్లాడుకున్నాము. రెయిన్ తనకి అందరిలో Aung San Suu Kyi ఇష్టమని ఆవిడ గురించి కొంత చెప్పింది. నేహకి ఎలెన్ జాన్సన్ సర్లీఫ్ అంటే చాలా అభిమానమని చెప్పింది. ఇద్దరూ నావంక చూసారు. నేను బెనజీర్ భుట్టో అంటే, అభిమానమని చెప్పాను. ఆవిడ పదవిలో ఉన్నప్పుడు దేశానికి జరిగిన అభివృద్ధి మరియు ఇప్పుడు ఉన్న పరిస్థితుల గురించి చెబుతూ 'ఇండియా ఇష్టపడకపోయినా నాకు నచ్చే ఏకైక వ్యక్తి తనే' అన్నాను. నిజానికి రెయిన్, నేహలాగా నాకు అంతమంది గురించి తెలియదు. వారితో మాట్లాడుతూ నేను ఎంత లోక జ్ఞానం లేనిదాన్నో గ్రహించాను.

అన్నయ్యకి ఇవన్నీ తెలుసా అని మెసేజ్ పంపాను. 'పొలిటికల్ సైన్స్‌కి మారుతున్నావా ఏంటి?' వ్యంగ్యంగా బదులిచ్చాడు. తెలియని ఏకైక వ్యక్తి నేనే అని సిగ్గుపడ్డాను. అలానే భోజనం చేస్తూ వివిధ దేశాల్లో ఏం జరుగుతుందో చర్చించుకున్నాము. నేను వండిన వంకాయ కారంగా అనిపించడంతో దాన్ని పప్పులో నంచుకుని తింది రెయిన్. అలా దాదాపు మూడు గంటలు కాలక్షేపం చేసిన తరవాత నేను, రెయిన్ లైబ్రరీకి బయలుదేరాము. నేహ కొద్దిసేపు లాండ్రి పూర్తిచేసి జిమ్ కి వెళతానని చెప్పింది. లైబ్రరీలో రెయిన్ తన పుస్తకాలు వెదుకుతండగా నేను మరికొన్ని బయోగ్రఫీలు

తీసుకుందామని అటువైపు వెళ్ళాను. ఆఖరిసారి నేను లైబ్రరీకి వచ్చినట్టుకాక ఇప్పుడు చాలా మందే ఉన్నారు. చెక్ ఔట్ వద్ద పెద్దక్యూ ఉంది. రెయిన్, నేను కబుర్లు చెప్పుకుంటూ లైన్‌లో నిలబడ్డాము. తిరిగి రూముకి వెళ్ళేసరికి సాయంత్రం అయ్యింది. ఏ పుస్తకాలు ముందు చదవాలో ఆ పద్ధతిలో ఒకదాని పైన మరొకటి పెట్టి వెన్నెల ఇంటికి బయలుదేరాను. ఈసారి కూడా చుట్టూ చాలామంది జనాలు కనబడేసరికి కాస్త ప్రశాంతంగా అనిపించింది. వెన్నెల ఇంటి చుట్టుపక్కల వారు కూడా చాలావరకు తిరిగి వచ్చేసారు. కబపడ్డ ప్రతి ఒక్కరితో కొద్దిసేపు మాట్లాడి, సమ్మర్ హాలిడేస్ కబుర్లు వినడంతో వెన్నెల ఇంటికి నేను వెళ్ళేసరికి తను అప్పుడే వంట మొదలు పెట్టింది. నేను సహాయం చేస్తూ పొద్దున జరిగిన సంగతులన్నీ చెప్పాను. పదే పదే కాంపస్‌లో అంతమంది జనాలను చూసి ఆశ్చర్యపోయాను. అనడంలో "ఎక్కడికీ వెళ్ళకుండానే నీకు కల్చర్ షాక్ వచ్చింది" అని చాలాసేపు నవ్వింది.

రెయిన్ ఇంకా నేహ చెప్పిన వ్యక్తుల గురించి తెలుసా అని అడిగాను. లేదు, మొదటిసారి వింటున్నాను అనడంతో తెలివిలేని వ్యక్తిని నేనొక్కదాన్నే కాదని 'హమ్మయ్య!' అనుకున్నాను. తింటూ Aung San Suu Kyi గురించి డాక్యుమెంటరీ చూసాము. నిజానికి అది చూసి తిందామనుకున్నాను కానీ ఆ పని చెయ్యకుండా మంచిదైంది. ఇద్దరం పళ్ళెంలోది తిన్నాము కాని మారు వడ్డించుకోలేదు. మన బయట ప్రపంచం ఎంత ఘోరంగా ఉందో ఆ డాక్యుమెంటరీలో తెలిసింది. నిజానికి భారతదేశంలో కూడా వెనక పడ్డ ప్రదేశాలు ఉన్నా కూడా, పాకిస్థాన్‌లో మిలటరీ వారి పరిపాలన గురించి తెలిసినా కూడా, బర్మాలాంటి ప్రదేశంలో కూడా అలాంటి అణచబడ్డ ప్రపంచము ఇప్పుడే తెలుసుకున్నాను. అలా ఇంకా ఎన్ని ప్రదేశాలు ఉన్నాయో, నేను, వెన్నెల మా జీవితాలు ఇలా సుఖంగా ఉన్నందుకు, నాకు ఓ కష్టమైన పరీక్ష, తనకి ఓ కష్టమైన ప్రాజెక్ట్ మాత్రమే పెద్ద కష్టాలని ఎంతో ఆనందించాము. ఇదివరకటి కన్నా ఇప్పుడు మా జీవితం మీద, మాకున్న సదుపాయాలమీద గౌరవం రెట్టింపైంది.

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS